కొన్నగేదె

"ఏమండీ ఏమైంది? వెళ్లినపని పూర్తిఅయినట్లేనా?" అనడిగింది జానికమ్మగారు, అప్పుడే ఆయాసపడుతూ ఎండలో ఇంటికి వచ్చిన భర్తని చూచి.

"ఆ... చెప్తా... కొంచెం చల్లని మంచి నీళ్లియ్యి ముందు. నాలిక పిడచ కట్టుకు పోతోంది" అన్నాడు భర్త రామశేషయ్యగారు. జానికమ్మగారు యింట్లోకి వెళ్లింది మంచినీళ్లు తేవడానికి—

"వెధవ ఎండలు మరీ విపరీతంగా వున్నయ్. బయటకు వెళ్లటం అంటే భయం వేస్తోంది. కాని వెళ్లక తప్పటంలేదు. ఆపట్నాల్లో అయితే అవేవో గదులుంటాయిట. ఎప్పుడూ చల్లగానే వుంటాయట-అక్కడ కూర్చుని వుండుం" అని తనలో తానే విసుక్కుంటున్నాడు రామశేషయ్యగారు, ఎండలో వచ్చిన తపనయింకా తీరక. మంచి నీళ్లు తీసుకొస్తూ భర్తమాటలు విని జానికమ్మగారు అందుకొంది-"ఆ...ఇహ! అదొకటే మన మొఖాలకి తక్కువ. చల్లటి గదులుంటాయ్ట-గదులు - పల్లెటూళ్లో వుంటూ కమ్మటి మజ్జిగ తాగటానికైనా పెట్టి పుట్టలేదు. బస్తీల్లో వెళ్లి వుందామని కలలు గంటున్నారు. పాపం" అంటూ సాగదీస్తూ వచ్చి మరచెంబు భర్తచేతి కందించింది.

"ఇంతకీ వెళ్ళిన పనేమయిందో చెప్పారు కారేం"

"చెప్తానుండు మరి తొందర పడితే ఎలా!" అంటూ ఖాళీ మరచెంబు కిందపెట్టి మొదలెట్టాడు చెప్పటం "మొత్తానికి సాధించాననుకో - మనం కావాలనుకున్న గేదె-అంటే నువ్వు కోరుకున్న హంగులుఅన్నీ వున్న గేదె-చివరకి ఒకటి దొరికింది బయానా గూడ యిచ్చి వచ్చాను."

"బయానాగూడ యిచ్చారూ! నల్లగా నిగనిగలాడుతోందా గేదె?

శ్రీ సి. వి. నారాయణమూర్తి

కొరకొమ్ములేనా? పాలు బాగా యిచ్చేదేనా? నెయ్యి పూటకి ఎంతొస్తుందో?" అంటూ ప్రశ్న మీద ప్రశ్న కురింపించేసింది జానికమ్మగారు, సంతోషం పట్టలేక.

"ఆ ... నువ్వు కోరుకున్న హంగులన్నీ వున్నయ్ పూటకి రెండుశేర్లు పాలిస్తుంది. నెయ్యి అరసోలెడవుతుంది. అయితే ధర కొంచెం ఎక్కువే ననుకో-..."

"ఎంతేమిటి?"

"అబ్బే-ఎంత ... రెండు పచ్చ కాగితాలు" అంటూ నసుగుతూనే చెప్పాడు అప్పటికీ ఒకపాతిక తగ్గించే-భార్యా రత్నం ఏమంటుందోనని.

"పోతే పోయినయ్ లెండి ముష్టి రెండువందలు. డబ్బు మనం సంపాదించామా? మన్ని డబ్బు సంపాదించిందా? కావాలంటే మళ్లీ రేపీపాటికి సంపాదించచ్చు - మనం కోరుకున్న గేదె వచ్చింది. అంతే చాలు - అయితే ఎప్పుడు తోలుకొస్తారు"

"ఎల్లుండి మంగళవారం మంచిది పశువుల్ని తోలుకురావడానికి. ఆరోజే తోలుకొస్తాను"

"అయితే ఈలోగానే మంచి యిత్తడి చెంబుఒకటి చేయించండి- కాస్త పెద్దదే చేయించండి, మన మేపులో యింకాపాలు ఎక్కువ అవుతయ్ గూడను."

పాపం-జానికమ్మగారికి ఎన్నాళ్లనుంచో మనసు. చక్కటి గేదెనొకదాన్ని కొందామని. కొన్న మజ్జిగ తాగలేక విసుగొస్తోంది. అన్నిటికంటె పక్కింటి రాజమ్మగారు రోజూ దొడ్లోనుంచి పాల చెంబు పట్టుకెళ్తూ వయ్యారంగా, అహంభావంతో నవ్వుతూంటే అరికాలి మంట నెత్తికెక్కేది!! మహా! ఆవిడికే గేదె వుందేం! రేపీపాటికి నేను అంతకంటే మంచి గేదెను కొని దొడ్లో కట్టేయించలేకపోతే గద! అప్పుడుగాని ఆవిడ పొగరు అణగదు" అని అనుకుంటూ భర్త రామశేషయ్య

గార్ని ఈరెండు నెలలనుంచి వూపి రాడకుండా వూళ్లవెంట తిప్పుతోంది. తిరిగి తిరిగి రామశేషయ్యగారికి విసుగుపుట్టిందే గాని తమకు నచ్చిన గేదె దొరకలేదు - పాపం ఈసారి కూడ విసుక్కుంటూనే గత్యంతరంలేక వెళ్లాడు ప్రక్కనే మూడు క్రోసుల దూరంలో వున్న పాలెం. ఇంక అక్కడ గేదెను చూచిన తరువాత వదల బుద్ధయింది కాదు; అదీకాక యింకతిరగటానికి గూడ వోపిక లేదు. అందుకనే కాస్త ధర ప్రియమైనా బయానా యిచ్చి వచ్చాడు—

మంగళవారం ప్రొద్దున్నే వర్జ్యం లేకుండా చూచి బయలుదేరి పాలెం వెళ్లాడు రామశేషయ్యగారు, రెండు వందలు చేత బుచ్చుకొని. ఇక్కడ జానికమ్మగారు ముందు పక్కింటి రాజమ్మగారితోనే చెప్పింది, తమ గేదెను గురించి. ఆవిడ "అలాగా" అని వూరుకొంది. ఇంక మధ్యాహ్నం అయ్యేసరికల్లా ఆవీధిలో వాళ్లందరికీ చెప్పేసింది. సంతోషించిన వాళ్లు సంతోషించారు, విసుక్కునే వాళ్లు విసుక్కున్నారు. "ఆవిడ గేదెను గురించి మనతో చెప్పుతుంది దేనికీ" అని. అవన్నీ ఆవిడ పట్టించుకొనే మనిషి కాదు. చెప్పడం వరకే ఆవిడపని.

సాయంత్రానికల్లా గేదెను తోలుకొచ్చాడు రామశేషయ్యగారు. దానికింత దిష్టితీసి పాకేసి దొడ్లో కట్టేయించింది. కొత్తగా చేయించిన పాలచెంబుతో ఆపూటే తన స్వహస్తాలతో ప్రారంభోత్సవం జరిపింది జానికమ్మగారు.

రామశేషయ్యగారి పని పూర్తి అయి తెరిపినిబడ్డారు గాని, గేదె వచ్చిన దగ్గరనుంచి జానికమ్మగారికి క్షణం తీరిక లేదు. దానికి సరిగ్గా మేత అమురుతుందో లేదో చూడ్డం వేళకి చిట్టుతవుడుపోసి నీళ్లు పెట్టడం రెండుపూటలూ పాలు తీయడం

జానికమ్మగారికి కోపం ఆగక ముందు దీనికి బుద్ధిచెప్పి తర్వాత భర్తకు బుద్ధి చెప్తామని కఱ్ఱ తీసుకుని నడ్డి విరిగేటట్లు ఒక్కటి పెట్టింది.

★ కొన్న గేదె ★

లాంటి పనుల్లో మునిగి తేలుతోంది. ఇప్పుడు ప్రక్కింటి రాజమ్మగారికంటే దర్జాగా నడుస్తుంది- ఆమెకేగాదు తమకీ ఒక గేదెమంచిదే వున్నదన్న భావంతో—

వారంరోజులు గడిచాయి. గేదె బాగా కండబట్టి పాలుగూడా జాస్తిగానే యిస్తోంది. యింతలోకే జానికమ్మగారి పుట్టింటినుంచి వుత్తరం వచ్చింది, మేనల్లుడు బారసాలకు రమ్మని కోరుతూ. పాపం వెళ్లక తప్పేటట్లులేదు. ఈగేదెను, పాడిని వదిలి వెళ్లాలంటే కష్టంగానే వుంది. అదీగాకుండా అదివచ్చిన దగ్గరనుండి పాలుతానే తీస్తోంది, భర్త తీస్తానన్నా వినకుండా. మళ్లీ యింకొకళ్ల కిస్తుందో యివ్వదోనన్న అనుమానం. చివరకు వెళ్లక తప్పక వెడుతూ "గేదె జాగ్రత్తండోయ్. మళ్లీ నేవెంటనే వచ్చేస్తాను లెండి: కొంచెం పాలు కనిపెట్టి తియ్యండి. పాలు యివ్వకపోతే ముందు కాస్త చిట్టో పొట్టో పెట్టి తియ్యండి. వదిలేశారంటే అసలు పొంతం ఎగ్గొడుతుంది" అని యిట్లాంటి హెచ్చరికలు చేసి మరీ వెళ్ళింది.

ఇంక గేదె బాధ్యతంతా రామశేషయ్యగారి నెత్తినే పడ్డది. జానికమ్మగారు వూరికెళ్ళిన మర్నాడు ప్రొద్దున్నే పాలచెంబు తీసుకొని బయలుదేరాడు. పాలు తీయడానికి సంసిద్ధుడై కూర్చుండేటప్పటికి గేదె బెదురు చూపులు చూస్తూ కొంచెం గల్లంతు మొదలెట్టింది. దీనికి కొంచెం లంచం పెట్టందే పాలివ్వదని లోపలికి వెళ్ళి తవుడుబుట్ట తీసుకొచ్చి ముందుపెట్టి కూర్చున్నాడు మళ్ళీ పాలు పితకడానికి. గేదెమాత్రం తింటంలో లోపం చెయ్యలేదు. ఈయన పితకడం ప్రారంభించేసరికి గేదె తింటం మానేసి ఈయన వంక చూసి కొంచెం గల్లంతుచేసి ఒక్కతన్ను తన్నింది. ఆ దెబ్బతో రామశేషయ్యగారి పళ్లు వూడి కింద పడవలసిందేకాని, అదృష్టవశాత్తు ఆదెబ్బ చెంబుకు తగిలి వెళ్ళి కాస్తంత దూరంలో పడ్డది. ఇంక లాభం లేదని ఆపూటకి వదిలేసి యింట్లోకి వెళ్ళాడు. ఆరాత్రికి గూడా పాలు తియడం మానుకున్నాడు, ప్రొద్దున్న తిన్నదెబ్బ గుర్తుకొచ్చి—

కాని పడుకుంటే ఎంతకీ నిద్దరొచ్చింది కాదు. వెధవ గేదె-రెండువందలు పై చిలుకు పెట్టి కొన్నానే! పాలు యివ్వకుండా ఎగ్గొడుతున్నదేమిటీ! రోజూ భార్యారత్నం గూడ యింత అవస్థ పడుతోందా పాలు తియడానికి, అని అనుమానం గూడ వేసింది. అబ్బే! యింత అవస్థ రోజూ ఆమెకు గూడ వుంటే ఎప్పుడో అమ్మివెయ్యమనేది. ఆమెకి దీనికిటు కేమిటో తెలుసు. అని తనలో తాను సమర్థించుకున్నాడు. యింక ఈవిధంగా వదిలేస్తే అలవాటుతప్పి అసలు పాలు ఎగ్గొడుతుందేమో! ఇంక ఆవిడగారికీసంగతి తెలిస్తే, చివరకు పాలు గూడ తీయలేనంత అసమర్థుడిక్రిందజమకట్టి వేళాకోళం చేస్తుంది- యింక ఏదో విధంగా రేపు ప్రొద్దున పాలు తీయాలని నిశ్చయం చేసుకున్నాడు.

ప్రొద్దున్నే కొంచెం మసక చీకటి వుండగానే లేచి ప్రక్కనే దండెం మీద వేసివున్న వుత్తరీయం కప్పుకున్నాడు, కొంచెం చలిగావుంటేను. వెళ్ళి పాలచెంబు తీసుకుని గేదెదగ్గర కూర్చున్నాడు. గేదె ముట్టితో వాసన చూచి గోల చెయ్యకండా పాలు తీయ

బుజ్జాయి తన కొత్తసైకిలు మీద ప్రజ్ఞ చూపిస్తున్నాడు. ఒకమాటు రోడ్డుమీదికి పోనిచ్చి, వెనక్కివస్తూ బల్లి చేతులు కొట్టి ముద్దుగా అన్నాడు: "అమ్మా! చూడు, చేతులేవ్!"

"ఆఁ ఆఁ! జాగ్రత్తనాయనా దెబ్బలు తగిలించుకుంటావ్!"

బుజ్జాయి పువ్వుల నవ్వు నవ్వి మళ్లా ఒక "ట్రిప్పు" కొట్టివచ్చి అరిచాడు "ఏమేవ్: చూడు చూడు; కాళ్లులేవు!"

"బుజ్జిబాబూ, దెబ్బ తగిలించుకుంటావు నాయనా!"

మనవాడు మళ్లీపోయి కొంచెం ఆలస్యంగా తిరిగి వచ్చి, అట్లాగే కేక వేశాడు, కానీ అంత హుషారుగా లేని మాటతో:

"అమ్మా చూడు, పళ్లు లేవే!"

—శ్రీ పి. నరసింహాచార్య, బందరు

నిచ్చింది. రామశేషయ్యగారి ఆనందానికి మేర లేదు. పాలు తీయడం పూర్తి అయేటప్పటికి తెల్లవారిపోతూంది. పాల చెంబు చేత్తో పుచ్చుకుని యింక లేద్దామనుకునేటప్పటికి, ప్రక్కింటి రామావధాన్లుగారు "రామశేషయ్యా లేడా అన్నాయ్" అంటూ వచ్చాడు. రామశేషయ్య ఆశ్చర్యపోయాడు-తను ఎదురుగ్గా వుండగా రామశేషయ్య ఏడీ అని అడుగుతాడేమని! రామావధాని దగ్గరకొచ్చి "నువ్వేనటోయ్ చీరె చూసి మీ ఆవిడేమో ననుకున్నాను చీరె కప్పావేమిటి పైన" అనడిగాడు. అప్పుడు తెల్సుకున్నాడు రామశేషయ్య, తను వుత్తరీయానికి బదులు చీరె కప్పుకున్నానని—యింక జరిగిందంతా స్నేహితునితో చెప్పేశాడు దాపరికం లేకుండా! ఇవ్వాళ ఎందుకనో పాలుకూడ ఇచ్చిందన్నాడు. అప్పుడు నవ్వుతూ చెప్పాడు రామావధాని, కొన్ని గేదెలు పాలు ఆడవాళ్లు తీసే అలవాటువుంటే మగవాళ్ళకు యివ్వవని, యివాళ ఆ చీర పైన లేకపోతే నిన్న జరిగిన ప్రాయశ్చిత్తం మళ్ళీ తప్పేది గాదనీని.

ఇంక ఆ రోజునుంచి పైన చీరె శుభ్రంగా కప్పుకొని, నెత్తిన ముసుగుకూడ వేసుకొని పాలు తీయడం మొదలెట్టాడు. తను పొరపాటున కప్పుకున్న చీరె చివరకు తనకు వరప్రసాదమైనందుకు చాల ఆనంధపడ్డాడు.

జానికమ్మగారు వెళ్ళిన పదవనాడు ప్రొద్దున్నే, యింకా మనక చీకటి వుండంగానే మామూలుగా చీరె మొత్తం కప్పుకొని నెత్తినికూడ ముసుగు వేసుకొని పాలు తీస్తున్నాడు రామశేషయ్యగారు. ఇంతలో వూరినుంచి అప్పుడే వచ్చిన జానికమ్మగారు యింట్లో భర్త లేకపోవడం చూచి దొడ్లోకి వచ్చింది. అక్కడినుండి చూచేటప్పటికి, తన కళ్ళను తనే నమ్మలేకపోయింది. తను లేనిసమయంలో పరాయి ముండను ఎవర్తెనో తీసుకొచ్చి, పైగా తన చీరెలు గూడ యిచ్చి, భర్త యింట్లోనే పెట్టుకున్నాడని ఆలోచన పోయేసరికి, ఆగ్రహం పట్టలేకపోయింది జానికమ్మగారు. అసలీ గొడవలోనే లేడు రామశేషయ్యగారు. ప్రక్కకి కదిల్తే తన ముఖం గేదె ఎక్కడ చూచిపోతుందోనన్న గొడవలో కదలకుండా కూర్చుని పాలుతీస్తూ ఆనందంలో మునిగి తేలుతున్నాడు.

జానికమ్మగార్కి కోపం ఆగలేదు. ముందు దీనికి బుద్ధిచెప్పి, తర్వాత భర్తకు బుద్ధి చెప్దామని ప్రక్కనే మడిబట్ట లారవేసుకొనే కర్ర తీసుకొని నరాసరి వెళ్లి ఏమీ ఆలోచించకుండా" నడ్డివిరిగేటట్టు ఒక్కటి పెట్టింది వీపుమీద. "నే లేనప్పుడు యింట్లో వుండి కులుకుతున్నావా !" అంటూ—

"ఆ...ఎవరూ..."అంటూ వెల్లికిలా పడ్డాడు రామశేషయ్యగారు. పాలచెంబు నాల్గుగజాల అవతల పడ్డది. ఈ కంగారుకు గేదెకూడా తన విధి తను నెరవేర్చుకుంది, ఒక్క తన్నుతో. - వెల్లికిలాపడ్డ రామశేషయ్యగారి మొఖంచూచి కంగారుపడ్డది జానికమ్మగారు. యింత అభాసు పని చేశానేమిటా అనుకుంది పాపం ఆ యిల్లాలు. సాయం పట్టి యింట్లోకి తీసుకువెళ్ళి మంచం మీద పడుకోపెట్టింది. జరిగిందంతా తెల్సుకునేటప్పటికి విచారం నవ్వూ రెండూ కలిగినై జానికమ్మగార్కి. రామశేషయ్యగారి నడుంకి సున్నంపట్లు పోయి మామూలు స్థితికి వచ్చేసరికి నెలరోజులు పట్టింది. అక్కడ కాయగాచిపోయింది శరీరం. ఆ కాయను చూచినప్పుడల్లా తన ప్రతాపం తన భార్య పరాక్రమం గుర్తుకొచ్చినప్పటికీ, ఎవరైనా కాయేమిటని అడిగితే మాత్రం స్నానంచేస్తూ కాలుజారి పడ్డానని చెప్పుతుంటాడు రామశేషయ్యగారు. ★

"డాక్టరుగారూ! నా భార్యకు వెర్రెక్కుతుందేమో నని భయంగా వుందండీ"

"ఏం?

"ఒక గొర్రెను కొనుక్కోవాలంటూం దండీ!"

"కొనుక్కోనీండి!!"

"మరైతే దాన్ని ఇంట్లోనే వుంచుతుందిట!"

"సరే, అలాగే చెయ్యనీండి!"

"బాగానే వుంది; గొర్రె కంపు కొట్టదూ !"

"అయితే కిటికీలు తెరవండి"

"ఏమిటీ! నా పిచ్చికలూ, పావురాల్నీ బయటికి వదులుకోనా !!!"

—శ్రీ పి. నరసింహాచార్య, బందరు.